క్లుప్తంగా

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు

రేపల్లె రూరల్: రెవెన్యూ సదస్సులు విజయవంతం అయ్యేలా అధికారులు పనిచేయాలని ఆర్డీవో ఎస్.రామలక్ష్మి కోరారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బందితో ఆమె మాట్లాడారు. శుక్రవారం నుంచి జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరపాలని ప్రభుత్వ ఆదేశించిందన్నారు. ప్రతి మండలంలో గ్రామాల వారీగా షెడ్యూల్ రూపొందించుకుని, సదస్సులు నిర్వహించుకోవాలని తెలిపారు. సదస్సులో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పేటేరు, మోర్లవారిపాలెంలో..

మండలంలోని పేటేరు, మోర్లవారిపాలెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్ల తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పేటేరు సదస్సులో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు.

అమర్తలూరులో గ్రామ సభలు ఇలా..

అమర్తలూరు(వేమూరు): రెవెన్యూ గ్రామ సభలు శుక్రవారం నుంచి జనవరి 7 వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దారు నెహ్రూ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు మండల షెడ్యూల్‌ను ఆయన ప్రకటించారు. ఈ మేరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించి, ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై మరుసటి రోజు సంబంధిత సచివాలయంలో విచారణ నివేదికను సమర్పిస్తారు. మొదటి రోజు తురుమెళ్ల, కోరుతాడిపర్రు, 10న మూల్పూరు, 12న పాంచాలవరం, 17న కూచిపూడి, 19న మోపర్రు, 21న ప్యాపర్రు, 26న ఇంటూరు, 28న గోవాడ, జనవరి 2న అమర్తలూరు, 4న పెదపూడి, 7న యలవర్రు, 8న బోడపాడు గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



రైలుపేట(భట్టిప్రోలు): మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు చేతి వృత్తులు ఎంతగానో దోహదపడతాయని భట్టిప్రోలు సర్పంచ్ దారా రవి కిరణ్మయి పేర్కొన్నారు. స్థానిక రైలుపేటలో గురువారం వీర్వో సంస్థ ఆధ్వర్యంలో మహిళల కుట్టు శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. నాలుగు నెలల పాటు 30 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తామని సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సర్కిల్ కో–ఆర్డినేటర్ కె.దేవకి, మండల సమాఖ్య వీవోఏ కర్రా స్వరాజ్యలక్ష్మి, దారా చెన్నయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



ఆళ్లమూడి(భట్టిప్రోలు): మండలంలోని ఆళ్లమూడి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామ మాజీ ఉప సర్పంచ్ రాజులపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. పంచాయతీ రాజ్ ఏఈ శేతు రామచంద్రరావు, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



తెనాలి రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి రైల్వే స్టేషన్‌లో బుధవారం అర్ధరాత్రి దాటాక చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి రైల్వే స్టేషనులోని మూడో నంబరు ప్లాట్‌ఫాం నుంచి నాలుగో నంబరు ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్టేషను మేనేజరు సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి. వెంకటాద్రి గురువారం తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

తెనాలి రూరల్: ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదైంది. పట్టణంలోని చెంచుపేటకు చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను గురువారం ఆశ్రయించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దాతృత్వ దివిటీ..సావిత్రి

- నేడు మహానటి సావిత్రి జయంతి
- తీరంతో మరపురాని అనుబంధం
- వడ్డివారిపాలెంలో ఉన్నత పాఠశాల ఏర్పాటు, సాయం..

రేపల్లె రూరల్: వెండి తెరపై ఆమె మరుపురాని మహానటి.. నిజ జీవితంలో అంతటి ఖ్యాతీ పొందిన దాతృత్వ దివిటీ. దాన ధర్మాలు చేసే ఆ చేతికి ఎముక లేదంటారు. తీరంలోని పాఠశాలకు, అందులో పని చేసిన ఉపాధ్యాయులకు చేసిన సాయమే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెబుతారు. గొప్ప వాళ్లని గౌరవించాలి.. గొప్పవాళ్లు కూడా గౌరవించదగినంతగా పేరు గడించారు అలనాటి సినీ నటి సావిత్రి. దేశ సంక్షేమానికి తన కూతురి నగలతో సహా.. తన ఒంటిపై ఉన్న నగలన్నీ వలిచి ప్రధాన మంత్రి సహాయ నిధికి అందించడం ఆమె దాతృత్వాన్ని తెలియజేస్తుంది. పేదరికంలో పుట్టి పెరిగి అనేక ఒడిగి దొడుకులు ఎదుర్కొని.. సాటి వారికి సాయం చేయడంతోనే సంతృప్తి, పరమార్థం ఉందని గ్రహించిన సావిత్రమ్మ పేరు వింటేనే కుగ్రామం వడ్డివారిపాలెం పులకించిపోతుంది. ఇక్కడ ఆమె ఏర్పాటు చేసిన ఉన్నత పాఠశాలకు శ్రీమతి సావిత్రి జెమిని గణేశన్ హైస్కూల్‌గా నామకరణం చేశారు. పాఠశాల ఆవరణంలో సావిత్రమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆమె కుమార్తె విజయ చాముండేశ్వరి చేతుల మీదగా ఆవిష్కరింపజేశారు. డిసెంబర్ 6న నడిగర్ తిలగం, మహానటి సావిత్రి జయంతి సందర్భంగా తీర గ్రామంతో ఆమెకున్న అనుబంధం గురించి..




పాఠశాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న మహానటి సావిత్రి(ఫైల్)



వడ్డివారిపాలెంలోని శ్రీమతి సావిత్రి గణేశన్ హైస్కూలు

గ్రామం, పాఠశాలతో సావిత్రి అనుబంధం..

సినీ నటి సావిత్రి తల్లి సుభద్రమ్మ, పెద్దమ్మ దుర్గాంబలది స్వగ్రామం వడ్డివారిపాలెం. తల్లి సుభద్రమ్మకు తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామానికి చెందిన నిశ్శంకర గురవయ్యతో వివాహమైంది. పెద్దమ్మ దుర్గాంబను బెజవాడకు చెందిన కొమ్మారెడ్డి వెంకట్రామయ్యకు ఇచ్చి పెళ్లి చేశారు.



పాఠశాల ఆవరణలో సావిత్రి విగ్రహం

వడ్డివారిపాలెంలో పాఠశాల లేకపోవటంతో పెద్దమ్మ దుర్గాంబ కోరికతో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సావిత్రమ్మ గ్రామంలో స్థలాన్ని కొనుగోలు చేసి, రూ.25వేలు అందించారు. 1962లో పాఠశాలను నిర్మించారు. పాఠశాల అభివృద్ధికి అనేక పర్యాయాలు సహకారం అందించారు. ఇక్కడికి విచ్చేశారు.

పాఠశాలకు చేసిన మహోపకారం..

ప్రభుత్వ పాఠశాలగా గుర్తింపు పొందిన తర్వాత కొన్ని కారణాల వల్ల ఉపాధ్యాయులకు నాడు వేతనాలు అందించడంలో ఆలస్యం జరుగుతుండేది. గవర్నమెంట్ గ్రాంట్ లేకపోవటంతో ఆరు నెలలైనా జీతాలు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఆనాటి పాఠశాల కరస్పాండెంట్‌ను ఫోనులో సావిత్రి పాఠశాల పరిస్థితిని ఆరా తీశారు. అక్కడి పరిస్థితిని కరస్పాండెంట్ వివరించడంతో.. 1975లో రూ.1,04,000 చెక్కును సావిత్రి పంపిచారు. ముందు ఉపాధ్యాయులకు వేతనాలు అందించండి, తర్వాత గ్రాంటు



పాఠశాలకు విరాళమిచ్చిన బస్సును నడుపుతున్న ప్రియాంక దత్, విజయ చాముండేశ్వరి(ఫైల్)

చూడొచ్చు అంటూ తెలిపారని గ్రామస్తులు చెబుతారు. నేడు ఆ నగదు చెక్కు విలువ రూ.1.25 కోట్లకు పైనే ఉంటుందని బ్యాంక్ అధికారులు అంటున్నారు. నేడు పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. గత పదేళ్లుగా విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధిస్తున్నారు. తైక్వాండో, షెటిల్, కబడ్డీ, ఖోఖో వంటి అనేక క్రీడల్లోనూ ప్రతిభ చాటుతున్నారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో 200 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

మహానటి చిత్ర యూనిట్ సాయం..

సావిత్రి జీవితాన్ని ఆధారంగా చేసుకుని మహానటి చిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పాఠశాలను సందర్శించింది. పాఠశాలకు తమ సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించింది. చిత్ర నిర్మాతలు ప్రియాంకదత్, స్వప్నదత్, సి.నాగ్ అశ్విన్‌రెడ్డి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు.

నాడు - నేడు మరింత అభివృద్ధి..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మనబడి నాడు - నేడు పథకంలో భాగంగా రూ.42 లక్షలతో తరగతి గదుల మరమ్మతులు, విద్యుద్దీకరణ, మరుగదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, బల్లలు, బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేశారు.

సావిత్రి సంకల్పం నెరవేరేలా..



మహానటి సావిత్రి ప్రారంభించిన పాఠశాలను అన్ని రంగాల్లో ముందుంచేలా ఉపాధ్యాయ బృందం పనిచేస్తోంది. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ప్రార్థన గీతం మొదలు.. పాఠశాల ముగిసే వరకు విద్యార్థులు అన్ని రంగాల్లో క్రమశిక్షణతో రాణించేలా పనిచేస్తున్నాం.

– బి.మాదవి, హెచ్ఎం, వడ్డీవారిపాలెం ఉన్నత పాఠశాల

'హైందవ శంఖారావం' విజయవంతానికి పిలుపు



రేపల్లె రూరల్: విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావంలో ప్రతి ఒక్కరూ పాల్గొని, జయప్రదం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ పిలుపున్నారు. ఈ మేరకు పట్టణంలోని 1వ వార్డు సీతారామ మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మం, దేవాలయాల రక్షణ, హిందువుల ఐక్యతకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. అనంతరం డిసెంబరులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలపై సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, రేపల్లె సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, పడమట వెంకటేశ్వరరావు, గూడవల్లి బాబురావు, నంబూరి వేణు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



కర్లపాలెం: ఆరోగ్య సమస్యలతో వచ్చే వారికి మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం బుద్దాం గ్రామంలోని విలేజ్ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం, ప్రాథమిక పాఠశాల, పశు వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అధికారులతో మాట్లాడుతూ.. సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలని చెప్పారు. సమయపాలన పాటించాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యవంతమైన నేల ఆహారాభివృద్ధికి దోహదం

అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి

బాపట్ల: నేలకు ప్రాధాన్యమివ్వాలని, సంరక్షణలో అప్రమత్తంగా ఉండటం ప్రతి ఒక్కరి ప్రధానోద్దేశం కావాలని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు పి.ప్రసూనరాణి పేర్కొన్నారు. గురువారం నేలల దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యవంతమైన నేల ఆహారాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ పిలుపు మేరకు మట్టి గణాంకాల సేకరణ, పర్యవేక్షణ, నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. నేలల స్వభావానికి తగిన పంటలను వేసుకోవాలని, భూసారాన్ని అంచనా వేసి మాత్రమే రసాయనాలను, పురుగు మందులను మోతాదుకు మించకుండా వాడాలన్నారు. భూమికి హానికరంగా సంభవిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, తద్వారా నేల ఆరోగ్యంగా ఉండటమే కాక పర్యావరణ పరిరక్షణ కూడా చేపట్టినట్లవుతుందని పేర్కొన్నారు. విశ్రాంత డీన్ డాక్టరు పి.ఆర్.కె. ప్రసాద్, డాక్టర్ వి.శంకరరావు, సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఎం.లత నేలల పరిరక్షణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అసోసియేట్ డీన్ పి.ప్రసూనరాణి

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పాతబొమ్మువానిపాలెం(కొల్లిపర): సైబర్ నేరాలపై మహిళలు, రైతులు అవగాహన పెంచుకోవాలని తెనాలి రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పాతబొమ్మువానిపాలెంలో గురువారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలకు, రైతులకు సైబర్ నేరాలతో పాటు అవి జరిగే విధానాన్ని వివరించారు. బ్యాంకుల నుంచి డబ్బులు తెచ్చే సమయంలో అపరిచితులతో, అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మాయ మాటలు నమ్మవద్దని, అనుమానం వస్తే వెంటనే అక్కడ ఉన్న బ్యాంకు మేనేజర్ గానీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో గానీ సమాచారం అందించాలని సూచించారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పమని అడిగే వారితో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎస్ఐ పి.కోటేశ్వరరావు సైబర్ నేరాల్లో రకాలు, నేరగాళ్ల మోసాల గురించి వీడియోలు ద్వారా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి రజిని, ఎంపీటీసీ తుమాటి భీమారాణి , ఏఎస్ఐ పోతురాజు, సిబ్బంది తాతారావు, కూర్మారావు, నాగబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఎంపీటీఎం ఆకృతిలో హైస్కూలు విద్యార్థులు

తెనాలి: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7వ తేదీన జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (ఎంపీటీఎం) పురస్కరించుకుని స్థానిక ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో గురువారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. హైస్కూలుకు చెందిన 300 మంది విద్యార్థులతో ఎంపీటీఎం ఆకృతిని ఏర్పాటు చేశారు. చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ ఆధ్వర్యంలో పీఈటీ శ్రీనివాసరావు సహకారంతో ఏర్పాటైన ఆకృతిలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి భారత్‌మాతాకీ జై అని నినదించారు. 7న తల్లిదండ్రులకు, మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు టగ్‌ఆఫ్‌వార్ పోటీలను నిర్వహిస్తామని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి శుభదాన్ భోజనం కూడా ఉంటుందని కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఇన్‌ఛార్జి హెచ్ఎం సునీత తెలియజేశారు. ప్రసాద్, నవీన్, ప్రేమ్, మనోజ్, విజయ్‌సింహ, జాన్‌బీ, బాలమ్మ, కరిముల్లా, విజయలక్ష్మి, రాబియా భాసం, సంపూర్ణ, వెంకటరమణ, ఎస్ఎంసీ చైర్మన్ గాలి కిరణ్ పాల్గొన్నారు.



ఎంపీటీఎం ఆకృతిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

డ్రెయిన్ల నిర్వహణపై చైర్‌పర్సన్ ఆగ్రహం

తెనాలి అర్బన్: మురుగు కాల్వలను బాగు చేసి ఎంత కాలమైంది.. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి.. ఇలా ఉంటే వ్యాధులు ప్రబలవా? అంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 22వ వార్డులో గురువారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలు అధ్వానంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజుబాగు చేయాలని సూచించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్‌కుమార్ ఉన్నారు.



ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరి మృతి



కర్లపాలెం: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందడంతో పాటు మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని యాజలి రైతు ఉత్పత్తిదారుల కేంద్రం వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఎ.రవీంద్ర వివరాల మేరకు.. మండలంలోని యాజలి గ్రామానికి చెందిన ఓ పత్రికా విలేకరి నందిపాటి శ్రీరామ్ సునీల్ తన బైక్‌పై స్వగ్రామం నుంచి రెడ్డిపాలెం వెళ్తున్నాడు. బోలాయపాలేనికి చెందిన గుర్రం కోటేశ్వరరావు(58) బోలాయపాలెం నుంచి యాజలి రైతు ఉత్పత్తిదారుల కేంద్రం వద్దకు వస్తున్నాడు. ఈ నేపథ్యంలో వారిద్దరూ ఎదురెదురుగా ఢీ కొనడంతో.. కోటేశ్వరరావు రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీరామ్ సునీల్‌కు తీవ్ర గాయాలవడంతో 108 అంబులెన్స్‌లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. మృతుడు కోటేశ్వరరావుకు భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలున్నారు. పద్మావతి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎ.రవీంద్ర చెప్పారు.

భట్టిప్రోలు వీఆర్ఏ మృతి



భట్టిప్రోలు: గ్రామ రెవెన్యూ సహాయకుడు(వీఆర్ఏ) మంద్రు మస్తాన్ (67) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఆర్ఐ ఫణికుమార్, వీర్వోలు కాశీకృష్ణ, శివరామకృష్ణ, మంద్రు జక్రయ్య, పలువురు వీఆర్ఏలు మస్తాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి మట్టి ఖర్చులకు రూ.15వేలు అందజేశారు. మృతుడికి భార్య, సంతానం లేదు.

మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. భట్టిప్రోలు మండలం అద్దేపల్లి గ్రామానికి చెందిన యడాల చిట్టిబాబు పెదపులివర్రు గ్రామంలో మూడు బొమ్మల సెంటరు వద్ద మద్యం విక్రయిస్తూ పట్టుబడినట్లు వెల్లడించారు. అతని నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

బహిరంగ ప్రదేశాల్లో మందుల దహనం



తెనాలి అర్బన్: పేదలకు పంపిణీ చేయాల్సిన మందులను అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగులు బహిరంగ ప్రదేశంలో దహనం చేయడం సంచలనంగా మారింది. ఈ ఘటన తెనాలి సుల్తానాబాద్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద గురువారం ఉదయం వెలుగు చూసింది. తెనాలి సుల్తానాబాద్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రోగులను అవసరమైన మందులను ప్రభుత్వం సరఫరా చేసింది. వాటిలో సుమారు 25 బాక్స్‌ల మందులను సమీపంలో చెత్త వేసి తగుల పెట్టారు. స్థానికులు గమనించి మీడియాకు సమాచారం ఇచ్చారు. వీటికి గత నెలలో కాల పరిమితి ముగియడంతో సిబ్బంది తగులబెట్టినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. సుల్తానాబాద్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ ముందు మందులను తగుల పెట్టిన విషయం తన దృష్టికి వచ్చిందని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. కాలపరిమితి ముగిసిన మందులను నిబంధనల ప్రకారం బయో మెడికల్ వేస్ట్‌ను సేకరించే సిబ్బందికి అందజేయాల్సి ఉందని, నిబంధనలకు విరుద్ధంగా దహనం చేయడంపై విచారణ జరుపుతున్నామని చెప్పారు.

ఉపాధ్యాయుల నిరసన

భట్టిప్రోలు: అన్నమయ్య జిల్లాలోని రాయచోటి కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ అసిస్టెంట్ ఎస్కే అజాజ్ అహ్మద్ విద్యార్థుల చేతిలో దుర్మరణం చెందడంపై వివిధ ఉపాధ్యాయ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద గురువారం ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు ప్రస్తుతం విద్యార్థుల్లో నెలకొన్న హింసా ప్రవృత్తిని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి మార్గంలో పయనించే విధంగా చూడాలని కోరారు. అహ్మద్ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు కర్రా అరుణకుమారి, ఎస్కే మహబూబ్ బాషా, కూచిభొట్ల శ్రీనివాసశర్మ, చందలూరి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి పార్థసారథి

వేమూరు: ప్రభుత్వం రైతులకు గిట్టు బాటు ధర కల్పించేందుకు పని చేస్తోందని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మండలంలోని జంపని గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం తేమ 17 శాతం ప్రకటించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 22 శాతం తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. తేమ 22 శాతం పైన ఉన్నా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. అంతకు మించి తేమ శాతం ఉంటే.. రైస్ మిల్లర్లు బస్తాకు 5 కేజీల ధాన్యం తీసుకోవడం జరుగుతుందన్నారు. అయితే.. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతం 22 ఉంటే రైస్ మిల్లర్ల వద్ద 28 శాతం చూపిస్తున్నట్లు పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన మంత్రి.. కొనుగోలు కేంద్రం వద్ద సివిల్ సప్లయీస్ అధికారులు, రైస్ మిల్లుర్ల సమక్షంలోనే తేమ శాతం నిర్ధారణ చేయాలని అధికారులకు సూచించారు. ఒక వేళ రైస్ మిల్లర్లు రాకపోతే ఆ బాధ్యత వారే వహించాలన్నారు. లోడింగ్ ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని, అన్ లోడింగ్ బాధ్యత రైస్ మిల్లుర్లు భరించాలని స్పష్టం చేశారు. రైతుల నుంచి డబ్బులు వసూళ్లు చేయొద్దని ఆయన హెచ్చరించారు. రైతుల నుంచి బస్తాకు రూ.8 వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని మంత్రి పార్థసారథి తెలిపారు. రైతుల ఖాతాల్లో 24 గంటల్లో ధాన్యం నగదు జమ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. వర్షాల వల్ల ధాన్యం తడిసి పోకుండా కాపాడేందుకు పట్టలు పంపిణీ చేయాలని రైతులు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు, ఏడీ రామకృష్ణ, రేపల్లె ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి చందోలు సునీత, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యే ఆనందబాబు

బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధం

తెనాలి అర్బన్: బహిరంగ మల,మూత్ర విసర్జనరహితంగా పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారంఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెనాలి పట్టణంలో బహిరంగ మల మూత్ర విసర్జనను నిషేధించినట్లు ప్రకటించారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై రూ.500 జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. ప్రజలందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆయన సూచించారు.